క్లుప్తంగా

నేడు 'ఆరోగ్య సురక్ష'పై సమావేశం

బాడంగి: జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో శనివారం నుంచి జరగనున్న ఆరోగ్య శిబిరాలపై ప్రజాప్రతినిధుల్లో అవగాహన కల్పించేందు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ ఆంజనేయులు గురువారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరగనున్న సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఆరోగ్య వైద్యశాఖ అధికారులు, సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

గణపతి లడ్డూల వేలం

బాడంగి: వినాయకచవితి పండుగ సందర్భంగా వినాయకుడి వద్ద నైవేద్యంగా ప్రత్యేకంగా తయారు చేసిన లడ్డూలకు మంచి గిరాకీ పలికింది. వినాయక నిమజ్జనోత్సవ తిరువీధిలో బాడంగి, ముగడ కాలనీకి చెందిన లడ్డూలు వేలం వేయగా పలువురు పోటీ పడ్డారు. ముగడ కాలనీలో లడ్డూను చప్ప సూర్యనారాయణ 5 వేల200 రూపాయలకు దక్కించుకున్నాడు. బాడంగి యాదవులు వినాయకుడి లడ్డూ కూడా సుమారుగా 3వేలు పైచిలుక ధర పలికింది.

విద్యుత్ బిల్లుతో ఆధార్ అనుసంధానం

వీరఘట్టం: విద్యుత్ వినియోగదారులు అందరూ తమ కరెంటు బిల్లుకు ఆధార్‌కార్డు నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని వీరఘట్టం ట్రాన్స్‌కో ఏఈ డి.బాలాజీ గురువారం తెలిపారు. మీ ఇంటికి లైన్‌మెన్ వచ్చేటప్పుడు కరెంటు బిల్లుతో పాటు ఆధార్ కార్డు జెరాక్స్ కాపీని ఇవ్వాలని కోరారు.

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణ పొందిన మహిళలు

పాలకొండ: స్థానిక న్యూహోప్ ఫౌండేషన్ హల్లో ఆరు రోజులుగా కేంద్రజౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు అందించిన శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా న్యూహోప్ ఫౌండేషన్ చైర్మన్ బేతాళ సుదర్శన్ బెన్హర్ మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎవరి మీద ఆధార పడకుండా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ అల్లు సన్యాసిరావు, యాళ్ల పిలిప్, భేతాళ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆరోగ్య సురక్ష సర్వే



నేరడి-బీలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భామిని: మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలో ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలు కొనసాగుతున్నాయి. భామిని, బాలేరు, బత్తిలి పీహెచ్‌సీల పరిధి సచివాలయాల పరిధిలో ఇంటింట సర్వేలు చేపట్టారు. గురువారం నేరడి-బీ సచివాలయంలో ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభమైంది. ఏఎన్ఎం నీరజ, ఆశాదేవి, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేశారు.

కుట్టు శిక్షణతో ఉపాధి



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సంస్థ డైరెక్టర్

భామిని: కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి పొందాలని హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కె.ప్రభుదాస్ అన్నారు. భామినిలో మూడు నెలలుగా శిక్షణ పొందుతున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు గురువారం అందజేశారు. కార్యకర్త శ్రీవిద్య, బోధకురాలు మీనా, పలువురు మహిళలు పాల్గొన్నారు.

బయో రిసోర్సు సెంటర్ సందర్శన



సామూహిక గోమూత్రం సేకరణపై వివరిస్తున్న సీమోన్

భామిని: ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే గో మల - మూత్రాలతో కషాయాల తయారీ కోసం ఏర్పాటు చేసిన బయో రిసోర్సు సెంటర్‌ను భామిని, సీతంపేట, కొత్తూరు మండలాల గిరిజన రైతులు గురువారం సందర్శించారు. మండలం సన్నాయి కాలనీలో వాస్సన్, వెలుగు సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న బయో రిసోర్సు సెంటర్‌కు అవసరమైన గోమూత్రం సేకరణపై తెలుసుకున్నారు. సామూహిక గోశాల, గోమూత్రం సమీకరణను సెంటర్ నిర్వాహకుడు ఆరిక సీమోన్ వివరించారు. పీసీఓ హర్షిణి, స్వాతి, ఆనంద్, శ్రీనివాసరావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు

సీతంపేట: సోమగండి గ్రామంలో నూతన వీధి దీపాలు ఏర్పాటు చేశారు. పాతబల్బు లు కాలిపోవడంతో వెలుతురు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్పందించిన సర్పంచ్ రుతోని ఆధ్వర్యంలో బల్బులు వేసారు.

● వేడుకగా వినాయక నిమజ్జనం



తిరువీధిలో వినాయక విగ్రహం





బళ్ల వేషాల్లో దేవతా మూర్తుల అలంకరణ

నగర పంచాయతీలోని ఏలాం సెంటర్‌లో ఏర్పాటు చేసిన 12అడుగుల వినాయక విగ్రహం అంగరంగ వైభవంగా నిమజ్జనం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనుపోత్సవంలో భాగంగా ఆఘోరాల నృత్యం, కర్రసాములు, కోయిడ్యాన్స్‌లు, తప్పెటగుళ్లు, కోలాటంతో పాటు బళ్ల వేషాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వివధ దేవతామూర్తుల రూపంలో బళ్ల వేషాలను తిరువీధిలో ఏర్పాటు చేశారు. పట్టణంలో తిరువీధి అనంతరం సంకిలి వద్ద నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. - పాలకొండ

మోతాదుకు మించొద్దు..

- అధిక ఎరువులు వాడితే పంటకు నష్టం
- పంట దిగుబడి, పర్యావరణం, ఆరోగ్యంపై ప్రభావం
- మెలకువలు పాటిస్తే రైతులకు మరింత లాభం

పాలకొండ రూరల్:

ప్రస్తుత సీజన్‌లో పంటలకు పుష్కలమైన సాగునీరు అందడంతో పాటు వివిధ రకాల క్రిములు, పురుగులు ఆశిస్తాయి. సాగులో అధిక దిగుబడులను రాబెట్టేందుకు, కీటకాలను నాశం చేసేందుకు రైతులు మోతాదు మించి ఎరువులు, పురుగు మందులను వినియోగిస్తున్నారు. దీంతో భూసారం దెబ్బతింటుంది. పంటల దిగుబడి తగ్గుతుంది. ముఖ్యంగా పర్యావరణానికి, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని సంబంధిత శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు భూముల్లో నీరు నిలిచిపోయింది. ఈ క్రమంలో పంటలు దక్కించుకునేందుకు రైతులు ఎరువులపై ఆధారపడటం సర్వసాధారణమైంది. అవసరమై ఎరువులను తగిన మోతాదులో వినియోగించాలని అధికారులు, ఆర్‌బీకేల ద్వారా క్షేత్ర స్థాయి వ్యవసాయ సిబ్బంది రైతులకు సూచనలు చేస్తున్నారు.

పరిమితికి మించితే ప్రమాదం

పంటకు యూరియా అవసరమైన దాని కంటే ఎక్కువ వినియోగించడం వలన మొక్క మెత్తబడి చీడ పురుగులు ఆశిస్తాయి. దీనివల పంట ఏపుగా పెరుగుతుందే తప్ప దిగుబడి కనిపించదు. అలాగే సుడి దోమ ఆశించే ప్రమాదం ఉంది. భూమిలో డీఏపీ(భాస్వరం) తగిన మోతాదులో వినియోగించడం వలన మొక్క వేళ్లు బలంగా తయారవుతాయి. అధికంగా వాడటం వలన ఆర్థిక భారం తప్ప ప్రయోజనం కనిపించదు. పురుగు మందులు అధికంగా వాడటం వలన పంట ఎర్రబడుతుంది. ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటం వలన ప్రధానంగా రైతుకు ఆర్థిక భారం అవుతుంది. ఆ పంట ఆరగించటం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

ఇలా చేస్తే మేలు...

పంటకు ఆశించిన చీడపీడలను ముందుగా గుర్తించిన రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలి. వారి సలహాలు, సూచలను మేరకు క్రిమిసంహారక మందులు వినియోగించాలి. క్రిమి సంహారక మందులు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యాతా ప్రమాణాలను పరిశీలించాలి. పురుగు మందుల తయారీ గడువు తేదీలను, ఎంఆర్‌పీ ధరలను సరిచూసుకోవాలి. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లో ఎరువులను, పురుగు మందులను కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన వాటికి రసీదు (బిల్లు) తీసుకోవాలి. పురుగు మందుల సీసాలు సీల్‌ను, ఎరువుల బస్తాల సీల్‌ను సరిచూసుకోవాలి.



పొలంలో క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్న రైతు

నియోజకవర్గంలో సాగులో ఉన్న వ్యవసాయ భూమి

మండలం	సాగు విస్తీర్ణం
పాలకొండ	7,250 హెక్టార్లు
వీరఘట్టం	8,997 హెక్టార్లు
సీతంపేట	7,702 హెక్టార్లు
భామిని	6,432 హెక్టార్లు

సూచనలు పాటించాలి



మార్కెట్‌లో కొనుగోలు చేసే క్రిమి సంహారక మందులు, ఎరువుల విషయంలో అవగాహన పెంచుకోవాలి. అధికారులు సూచనలు పాటించడం వలన ప్రయోజనం ఉంటుంది. ఆర్‌బీకేల ద్వారా మా సిబ్బంది రైతులకు అవసరమగు సలహాలు, సూచనలు రైతులకు అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో అన్నదాతలకు అవగాహన సదస్సులు చేపడుతున్నాం.
- ఎన్ని వాహిని, ఏఓ, పాలకొండ

పశువ్యాధులపై అవగాహన అవసరం



రైతులకు మందులు అందజేస్తున్న పశు వైద్యాధికారి

గుమ్మలక్ష్మీపురం: వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని గొరడ పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని వంజరాపు గూడ గ్రామంలో గురువారం ఆయన వైఎస్సార్ పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, ఆడ పెయ్యలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వర్షాకాలంలో వచ్చే జబ్బువాపు, గొంతు వాపు, ముద్దచర్మ వ్యాధులకు అలాగే గొర్రెలు, మేకలకు వచ్చే చిటుకు వ్యాధి, మూతిపుండ్లు, ముసరా వ్యాధులకు కూడా టీకాలు వేశారు. పశు వ్యాధి సంబంధిత మందులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు కె.మణికంఠేశ్వరి, ఎస్.శరత్, ఆరిక పవన్, సీమల గణేష్ ఉన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ



జె.కొత్తవలసలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేలో భాగంగా రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. తహసీల్దార్ డి.రత్నకుమార్ ఆదేశాల మేరకు భూముల రీసర్వే పూర్తయి, పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులకు వారితో ఈకేవైసీ నమోదు చేసుకొని పట్టాదారు పాసుపుస్తకాలను వీఆర్‌ఓలు గ్రామాలకు వెళ్లి రైతులకు అందజేస్తున్నారు. అందులో భాగంగానే మండలంలోని పూనువలస పంచాయతీ జె.కొత్తవలస గ్రామానికి చెందిన రైతులకు గురువారం పట్టాదారు పాసు పుస్తకాలను వీఆర్‌ఓలు బేరి శ్రీనివాసరావు, సువ్వాడ నరసింహనాయుడు పంపిణీ చేశారు. భూముల రీసర్వే ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, రైతులంతా భూముల రీసర్వేను సక్రమంగా వినియోగించుకోవాలని వారు కోరారు.

ముస్లింల ర్యాలీ



కురుపాం: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

కురుపాం: మండల కేంద్రంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం సోదరులు జామియా మసీద్ కమిటీ మత గురువు షేక్ సర్దార్ మా లీం ఆధ్వర్యంలో శివ్వన్నపేట నుండి కురుపాం మండల కేంద్రంలోని పలు వీదుల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త బోధనల ను, సూక్తులను ప్రజలకు తెలియజేసారు. ర్యాలీలో కురుపాంకు చెందిన ముస్లిం మత పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ ఎస్.శ్యామ్‌సుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరఘట్టం ఫీడర్ పరిధిలో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం ఈ అంతరాయం ఏర్పడనున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తంపటాపల్లి, తుమరాడ, కోటిపల్లి, బుక్కూరు, గోపాలపురం, మంగళాపురం, బాసూరు, కోటిపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పాలకొండలో 'జగనన్నకు చెబుదాం'

పార్వతీపురం: మండల స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం పాలకొండలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ అర్జీలను తెలుపుకోవచ్చునన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అక్టోబర్ 4న జియ్యమ్మవలస, 16న వీరఘట్టం, 11న కురుపాం, 13న సీతంపేట, 18న సాలూరు, 20న పాచిపెంట, 25న భామిని, 27న గుమ్మలక్ష్మీపురం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా విఘ్నేశ్వర పూజలు

పాలకొండ రూరల్: పట్టణంలోని పెద్దగొల్ల వీధిలో కొలువుదీరిన వినాయక మండపంలో వసంతోత్సవాన్ని భక్తులు వైభవంగా చేపట్టారు. గురువారం స్వామివారికి సామూహిక కుంకుమ, పుష్ప, బిల్వార్చనలను మహిళలు నిర్వహించారు. స్థానిక దేవర పేటలో కొలువైన గణనాథునికి దంపతులు సామూహిక పూజలు చేపట్టారు. గాసీ వీధిలో సాక్షి గణపయ్యకు విశేష ప్రసాదాలను భక్తులు సమర్పించారు.

15,919 ఎకరాలలో ఈ క్రాప్ నమోదు

బలిజిపేట: మండలంలోని 18,500 ఎకరాలకు గాను ఇప్పటికి 15,919ఎకరాలలో ఈ క్రాప్ నమోదైందని ఏఓ శ్రావణ్ తెలిపారు. ఈ మేరకు బర్లిలో గ్రామంలో ఈ క్రాప్ నమోదును ఆయన గురువారం పరిశీలించారు. మొత్తం ఈ క్రాప్ నమోదు ఈనెలాఖరుకు పూర్తిచేయనున్నట్లు చెప్పారు. రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకోవాలని కోరారు. రైతులు సాగుచేస్తున్న పంట వివరాలను ఆర్బీకే వద్ద వీఏఏలకు తెలియచేసి, ఆవివరాలతో నేరుగా పంట వద్దకు వెళ్లి జియో కోఆర్డినేట్స్ ఆధారంగా పంట వివరాలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

అగ్ని అస్త్రం తయారీపై అవగాహన



బలిజిపేటలో తయారుచేస్తున్న ద్రావణం

బలిజిపేట: వరిపంటలో పురుగుల నివారణకు స్థానిక సర్పంచ్ రాఘలత ఆధ్వర్యంలో ఏఓ శ్రావణ్ కుమార్ గురువారం అగ్నిఅస్త్రం తయారు చేశారు. ఈ మేరకు తయారు చేసే విధానంపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ ద్రావణం వినియోగం పచ్చపురుగు, కత్తెరపురుగు తదితర పెద్ద పురుగుల నివారణకు ఉపయోగ పడుతుందని ఎంసీఆర్‌పీ లక్ష్మి వివరించారు. దీని తయారీకి గోమూత్రం, పచ్చిమిరపకాయలు, వెల్లుల్లి, పొగాకు గుండ, వేపాకులు, జిల్లేడు ఆకులు అవసరమని చెప్పారు. ముందుగా గోమూత్రం మరగపెట్టి తరువాత పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకుగుండ, వేపాకులు ముద్దలా నూరి దానిలో వేసి రెండు నుంచి మూడు పొంగులు వచ్చేవరకు మరిగించాలి. తరువాత దానిని 48 గంటలు నిల్వ ఉంచగా తయారైన కషాయాన్ని ఎకరాకు 8నుంచి 10లీటర్లు స్ప్రే చేయాలి. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కషాయాల వాడకం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నాణ్యమైన దిగుబడులు వస్తాయని తెలిపారు.

లక్ష్మీనృసింహ స్వామికి ముడుపుల పూజలు



ప్రత్యేక అలకంరణలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నది ఒడ్డున వేణు గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామివారికి గురువారం భక్తులు ముడుపుల పూజలు, అభిషేకాలు ప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో జరిగాయి. లక్ష్మీనృసింహ స్వామి వారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో దూర ప్రాంతాలనుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చి క్యూ కట్టారు. ముందుగా ఆలయప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వివిధ రకాలపూలు, పత్రాలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉదయం 6 గంటల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు.

నాణ్యతా ప్రమాణాలతో ఇంటింటి కుళాయి పనులు



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సీతానగరం: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా చేపడుతున్న ఇంటింటి కుళాయి, వాటర్ ట్యాంక్ పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వాహకులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సీతానగరం మండలంలోని లచ్చయ్యపేటలో జరుగుతున్న మంచినీటి పథకం పనులను జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు, ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం,సర్పంచ్ సీహెచ్ కృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం నిధులు రూ.8.81 లక్షలను మండలంలోని 39 గ్రామాల్లో ఇంటింటి కుళాయిల నిర్మాణానికి మంజూరుచేసినట్లు తెలియజేశారు. ఇంతవరకూ 23 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని,16 గ్రామాల్లో పనులు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇంటింటి కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తామని చెప్పారు.

రేబిస్ వ్యాధిపట్ల అవగాహన అవసరం



కుక్కలను పట్టే కార్మికులకు వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: రేబిస్ వ్యాధిపట్ల అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ప్రపంచ రేబిస్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. కార్మికులకు, కుక్కలను పట్టే వారికి కుక్కకాటుతో వచ్చిన రోగులకు ఏఆర్‌వీ ఇంజక్షన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ ప్రజలకు కుక్కకాటువల్ల వచ్చే రేబిస్ వ్యాధి గురించి అవగాహన ఉండాలని కుక్కకాటు వేసిన వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అవసరమైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. జిల్లా అస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి మాట్లాడుతూ కుక్కకాటుకు ఎటువంటి నాటు వైద్యం తీసుకోరాదని, వైద్యం తీసుకోవడంలో అలసత్వం కూడదని ప్రాణాంతకమని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సర్వేలైన్స్ అధికారి డాక్టర్ నవీన్‌కుమార్, ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్, యానిమల్ బైట్ క్లినిక్ సభ్యులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ



పీఏసీఎస్ చైర్మన్ శివున్నాయుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: మండలంలోని వెంకంపేట గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు ఇటీవలే ప్రమాదానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ల సూచనలు పాటిస్తూ విశ్రాంతి తీసుకుని మళ్లీ పూర్వస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పూర్వస్థితికి వచ్చిన తరువాత ప్రజా క్షేత్రంలో తిరిగి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు.వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరమేష్, పార్టీ నాయకులు సిద్దా జగన్నాథరావు, బంకురు రవికుమార్, బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, తీళ్ల చంటి, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణలో పాల్గొన్న ఎమ్మెల్యే

పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామంలో వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం నిర్వహించడం గొప్ప విషయమని, ఇటువంటి కార్యక్రమంలో భాగస్వామ్యమైనందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.